

సాక్షి బాపట్ల

శనివారం, 9, సెప్టెంబర్, 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.60 అడుగుల వద్ద ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు.



పుస్తకాల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1972 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం లైబ్రరీకి రూ.3 లక్షలు ఖరీదుచేసే 94 పుస్తకాలను ప్రిన్సిపాల్ ఉమాజ్యోతికి అందజేశారు.

న్యూస్‌రీల్

గాజుల అలంకారంలో పల్నాటి వీర్ల అంకాలమ్మ



కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లికి శ్రావణ మాసం నాలుగవ శుక్రవారం గాజుల అలంకారం చేశారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు గాజులు పంపిణీ చేశారు. అంకాలమ్మకు బోనాలు సమర్పించే కార్యక్రమం వైభవంగా కొనసాగింది. శాలివాహనులు, నాయీబ్రాహ్మణులు, ఆదినారాయణ కాలనీ వాసులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమ బండ్లు కట్టి మొక్కులు చెల్లించారు. ముందుగా అంకాలమ్మ గుడికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ ఆలయాలకు చేరుకుని అక్కడ అమ్మవార్లకు పోతురాజుకు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు.

4 టీఎంసీలు పెరిగిన పులిచింతల



అచ్చంపేట: వర్షాలు లేక పులిచింతల ప్రాజెక్టులో గణనీయంగా తగ్గిన నీటి నిల్వ గత వారంగా కురుస్తున్న వర్షాలు కొంత ఊరటనిచ్చాయి. ఎగువ ప్రాంతంలో నదీ పరివాహక ప్రాంతాలలో కురిసిన వర్షపునీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులో 4 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. ఈనెల 2వ తేదీ నాటికి ప్రాజెక్టులో 20.5640 టీఎంసీలు ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 24.5600 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 10,277 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,500, గరిష్ట ధర రూ.8,800, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

19 వరకు ప్రభుత్వ ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయివరప్రసాద్ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20న సర్టిఫికెట్ల పరిశీలన, 22న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 73868 85639 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంవో), సెక్టోరల్, ప్లానింగ్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులను డెప్యూటేషన్‌పై భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో పి.శైలజ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. గతనెల 31 నాటికి 50 ఏళ్ల లోపు వయసు కలిగిన గ్రేడ్–2 హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డైట్ అధ్యాపకులు అర్హులని, అర్హులైన వారు ఈనెల 15లోపు దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్ చూడాలని వెల్లడించారు.

మిర్చి యార్డులో 25,014 బస్తాల విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,112 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,014 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 25,000 వరకు లభించింది.

జెడ్పీలో మిర్చి ఘాటు

- నకిలీ విత్తనాలపై గరం గరం
- అధికారులను నిలదీసిన ఉమ్మారెడ్డి
- అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు
- వాడీవేడిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, గుంటూరు జిల్లా జేసీ రాజకుమారి, పల్నాడు జిల్లా జేసీ శ్యాంప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నకిలీ మిర్చి విత్తన విక్రయాలపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. నకిలీ విత్తనాలను విక్రయించి, రైతులను మోసం చేసిన డీలర్లపై చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులపై శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతోపాటు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకుని, సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకునే విషయంపై వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జోక్యం చేసుకున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు నకిలీ విత్తనాలు విక్రయించినట్లు విచారణలో రుజువైన తరువాత వ్యాపారులపై కేసుల నమోదుతోపాటు శాఖాపరంగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. గత 30 ఏళ్లలో నకిలీ విత్తనాలను విక్రయించిన ఏ ఒక్క వ్యాపారి తన వ్యాపారం మానుకోలేదని, అధికారులంటే వారికి ఏపాటి భయం ఉన్నదో చెప్పేందుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నకిలీ విత్తన విక్రయాలపై కమిషనర్‌కు నివేదిక పంపినట్లు అధికారులు బదులివ్వగా, ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించి, చేతులు దులుపుకుంటే చాలదని, చట్ట ప్రకారం కేసులు ఎందుకు నమోదు చేయించలేదని నిలదీశారు.

వైద్యారోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు

గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో కాన్పులు చేయడం లేదని పలువురు జెడ్పీటీసీలు సమావేశంలో లేవనెత్తిన అంశాలపై మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయని వివరించారు. రూ.కోట్ల వ్యయంతో పీహెచ్‌సీల్లో పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందని చెప్పారు. సిబ్బంది, వైద్యులు అంకితభావంతో పనిచేసి ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు.

మరిన్ని ముఖ్యాంశాలిలా..

- గుంటూరు శివారు నల్లపాడులోని గొర్రెల మండిలో జరుగుతున్న క్రయ, విక్రయాలపై మార్కెటింగ్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు జెడ్పీటీసీలు చేసిన ఆరోపణలపై మంత్రి అంబటి రాంబాబు అధికారులను నిలదీశారు. ప్రభుత్వం నుంచి అనుమతి ఉందా, ఉంటే సెస్సు రూపంలో ఎంత చెల్లిస్తున్నదీ చెప్పాలని ప్రశ్నించారు. దీంతో అధికారులు నీళ్లు నమిలారు.
- ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని గుంటూరు డీఈఓ పి.శైలజపై పలువురు జెడ్పీటీసీలు మంత్రి అంబటికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తనకూ ఫిర్యాదులు అందాయని, పద్ధతి మార్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా సభాముఖంగా డీఈఓ శైలజకు సూచించారు.
- ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులెవరూ ప్రొటోకాల్ పాటించడం లేదని తాడికొండ జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీగా ఉండి, ప్రయోజనమేమిటని, తక్షణమే రాజీనామా చేస్తానని సభా వేదిక వద్దకు వెళ్లారు. దీనిపై జోక్యం చేసుకున్న మంత్రి అంబటి, హెనీ క్రిస్టినా ఆమెను వారించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.
- బదిలీలు, ఉద్యోగోన్నతుల అనంతరం పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో ఏర్పడిన ఖాళీల భర్తీకి ఏం చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు పల్నాడు, గుంటూరు డీఈఓలు శామ్యూల్, శైలజ సమాధానమిచ్చారు. ఆయా ఖాళీలను ఎంటీఎస్ ఉపాధ్యాయులతో భర్తీ చేస్తున్నట్లు చెప్పారు.
- పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పెదవడ్లపూడి హైలెవల్ చానల్ నుంచి నంబూరు మీదుగా చేబ్రోలులోని శివారు ప్రాంతాలకు నీటిని అందించే పనులు పూర్తి చేయాలని చెప్పారు. దీనిపై అధికారులను వివరాలు కోరిన మంత్రి అంబటి పనులు పూర్తికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
- గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేయడంతోపాటు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు శాతం గణనీయంగా పెరిగిందని, బయోమెట్రిక్ ద్వారా రోజూ 98 శాతం మేర హాజరు నమోదవుతున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్, హెల్త్ అండ్ వెల్‌నెస్ విధానాలు విజయవంతమయ్యాయని, పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.
- సత్తెనపల్లిలోని జెడ్పీకి చెందిన ఎకరం 10 సెంట్ల స్థలంలో 40 ఏళ్లకు పైబడి నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు జెడ్పీ సమావేశంలో ఆమోదించి, ప్రభుత్వానికి పంపాల్సిందిగా మంత్రి అంబటి రాంబాబు సూచించారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు వివిధ సమస్యలను ప్రస్తావించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, గుంటూరు, పల్నాడు జేసీలు బి.రాజకుమారి, శ్యాంప్రసాద్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ భూసేకరణకు రూ.110 కోట్ల విడుదలకు కృషి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ఆగస్టు నెలలో ఇలాంటి వర్షాభావ పరిస్థితులు గత 122 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేవని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌తోపాటు శ్రీశైలం ప్రాజెక్టులోనూ నీరు లేదని, అయినా సాగర్ కుడికాలువ నుంచి ఖరీఫ్‌కు నీరు ఇచ్చేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల దిశగా రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు చానల్ భూసేకరణకు అవసరమైన రూ.110 కోట్ల విడుదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అలాగే వరికపూడిశెల నిర్మాణ పనులనూ వేగవంతం చేయిస్తామని చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో రూ.24 కోట్లతో 484 అభివృద్ధి పనులు

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.24 కోట్లతో 484 అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. జెడ్పీ కార్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీ పరిపాలనాధికారులుగా 20 మందికి ఉద్యోగోన్నతులు కల్పించగా, సీనియర్ అసిస్టెంట్–19, టైపిస్ట్–ఏడు, రికార్డు అసిస్టెంట్లుగా 19 మందితో కలుపుకుని మొత్తం 55 మందికి ఉద్యోగోన్నతులు కల్పించామని వివరించారు. ఉద్యోగుల బదిలీలను పారదర్శక విధానంలో చేపట్టామని తెలిపారు. కారుణ్య నియామాల ద్వారా 65 మందికి ఉద్యోగాలను కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత విద్యాసంవత్సరంలో పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఎంతో ప్రయోజనం చేకూర్చిందని, ఈ ఏడాది నవంబర్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఆయకట్టు చివరి భూములకూ సాగునీరు

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణావు

బాపట్ల: జిల్లాలోని ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా నీటిపారుదల సలహా మండలి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి 38 టీఎంసీల నీరు అవసరం ఉందన్నారు. ఇప్పటికే 9 టీఎంసీల నీరు వినియోగించుకోవడం జరిగిందన్నారు. ఇంకా జిల్లాలో వ్యవసాయానికి 28 టీఎంసీల నీరు కావలసిన ఉందన్నారు. రాబోయే రెండు నెలల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఒక వేళ వర్షాభావ పరిస్థితులు వస్తే వారాబందీ విధానంలో రైతులకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా పశ్చిమ డెల్టా కాలువల ద్వారా 3,700 క్యూసెక్కులు విడుదల లక్ష్యం కాగా గత మూడు రోజుల నుంచి 5,500 క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రైతులు కాలువల నుంచి విడుదలైన సాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. సాగునీటి కాలువలు, డ్రెయినేజీ కాలువల మరమ్మతుల పనులకు సంబంధించి అంచనాలు నవంబర్‌లోగా తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు వేసిన పంటలు ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఈకేవైసీ కూడా పూర్తి చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో అర్హులైన వారందరికీ పంట సాగు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గుర్తింపు కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, ఉద్యానవన శాఖ ఏడీ జెనెమ్మ, నీటిపారుదల శాఖ ఎస్ఈ మురళీ కృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా జగనన్నకు చెబుదాం

- వారంలో రెండు రోజులు ఫిర్యాదుల దినోత్సవం
- ప్రతి బుధ, శుక్రవారాలు మండల కేంద్రాల్లో..
- క్షేత్రస్థాయికి కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు
- అక్కడే సమస్యలపై వినతులు
- సత్వర పరిష్కారానికి చర్యలు
- సెప్టెంబర్ 13 నుంచి కార్యక్రమం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించే లక్ష్యంతో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. క్షేత్రస్థాయిలో అర్హులు ఎవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఒకటికి పలుమార్లు ప్రజల వినతులను వడపోస్తోంది. మరోవైపు వలంటీర్ల వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో పథకాలు అందని అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా మార్చింది. ప్రభుత్వ పథకాలతోపాటు ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందుకోసం ప్రతిసోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. రెవెన్యూ సమస్యల కోసం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అంతటితో వదిలేయకుండా జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లింది. క్షేత్రస్థాయి సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. సామాన్య ప్రజలకు మేలు చేకూర్చింది. ఇలాంటి కార్యక్రమాల నిరంతర నిర్వహణతో ఎంతో ప్రయోజనం ఉంటుందని భావించి తాజాగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన తరహాలో మండల స్థాయిలో వారంలో రెండురోజులు ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది.

బాపట్ల జిల్లాలో షెడ్యూల్ ఇలా..

కలెక్టర్ మార్గదర్శకత్వంలో నిర్దేశించిన తేదీలలో మండల కేంద్రాలలో జగనన్నకు చెబుదాం–ఫిర్యాదుల దినోత్సవం నిర్వహిస్తారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఈ కార్యక్రమాలు వరుసగా జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగుతాయి. బాపట్ల జిల్లాలో సెప్టెంబర్ 13న ఈ కార్యక్రమం పారంభమవుతుంది. తొలుత కర్లపాలెం మండలంలో మొదలు కానుంది. ఆ తరువాత 15వ తేదీ శుక్రవారం ఉద్యోగుల స్పందన కార్యక్రమం జరగనుంది. 20వ తేదీ బుధవారం పీవీ పాలెం, 22 శుక్రవారం కొల్లూరు, 27 బుధవారం చీరాల, 29 శుక్రవారం సంతమాగులూరు మండలాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ రంజిత్‌బాషా పాల్గొంటారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలు మిగిలిపోయి ఉంటే వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించింది. సెప్టెంబర్ 13 నుంచి జిల్లాలో ఈ కార్యక్రమం మొదలు కానుంది. అధికారులందరూ దీనిలో భాగస్వాములు అవుతారు. ప్రతిఒక్కరి నుంచి అర్జీలు స్వీకరిస్తారు. పరిష్కారానికి సాయశక్తులా కృషి చేస్తారు. జవాబుదారీగా ఉంటారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్లజిల్లా

అలా అలరారాయి

- హద్దు, ఫెన్సింగ్ రాళ్లుగా గ్రానైట్ ముడి వ్యర్థాలు
- కుటీర పరిశ్రమలా వేలాది మందికి ఉపాధి
- పొరుగు రాష్ట్రాలకూ ఎగుమతులు
- బీమా వర్తింపజేయాలని కార్మికుల వినతి



ట్రాక్టర్‌పై ఎగుమతులు



వల్లాపల్లి సమీపంలో రాళ్లు తీస్తున్న కార్మికులు

బల్లికురవ: గ్రానైట్ ముడి వ్యర్థాలతో వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. హద్దు, ఫెన్సింగ్ రాళ్ల తయారీతో కుటీర పరిశ్రమలు అలరారుతున్నాయి. పొరుగు రాష్ట్రాలకూ ఈ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.

పక్కన పడేసే వృథా చెక్కలే ఆధారంగా..

బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కొణిదెన సమీపంలోని ఈర్లకొండ, గురిజేపల్లి, పల్నాడు జిల్లా బొప్పూడి సమీపంలో విస్తారంగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల నుంచి తీసే ముడిరాళ్లు బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి మండలాలు, చిలకలూరిపేట సమీపంలో ఏర్పాటు చేసిన గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లకు ఎగుమతవుతున్నాయి. పాలిషింగ్ యూనిట్లలో పరుపురాళ్లను తయారు చేస్తారు. ఈ పరుపురాళ్లు తీయగా వచ్చే వృథా చెక్కలను పక్కన పడవేస్తుంటారు. ఈ వ్యర్థాల నుంచి పొలాలకు హద్దురాళ్లుగా 2 అడుగుల ఎత్తు, కార్మాగారాల చుట్టూ ఫెన్సింగ్ రాళ్లుగా 5 అడుగుల నుంచి 6,7 అడుగుల వరకు తయారు చేస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద మండలంలోని వల్లాపల్లి, మార్టూరుకు చెందిన చాలామంది వ్యర్థ రాళ్లు సేకరించి కుటీర పరిశ్రమలాగా నిత్యం హద్దు, ఫెన్సింగ్ రాళ్లు తయారు చేస్తున్నారు. వేలమంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

నిత్యం ఎగుమతులు

కార్మికులు తయారుచేసే రాళ్లను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు లారీల్లో, దగ్గర ప్రాంతాలైతే ట్రాక్టర్ల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. కార్మికులు తీసే రాళ్ల కొనుగోలుకు వల్లాపల్లి, మార్టూరు, బొప్పూడి ప్రాంతాల్లో సుమారు 30 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. 2 అడుగుల రాయి ఒక్కొక్కటి రూ.60 నుంచి రూ.70, 5 అడుగులు రూ. 120 నుంచి 140 వరకు, 6 అడుగులు రూ. 140 నుంచి రూ. 150 వరకు, 7అడుగులు రూ. 150 నుంచి 160 వంతున కొనుగోలు చేస్తున్నారు. ఆర్డర్ల ప్రకారం ఎగుమతి చేస్తున్నారు.

పదేళ్లుగా రాయి తీస్తూ ..



గ్రానైట్ వృథా రాళ్లను బల్లికురవలోని ఫ్యాక్టరీల నుంచి తెచ్చుకుని పొలాలకు హద్దు, ఫెన్సింగ్ రాళ్లుగా మార్చి పదేళ్లుగా కుటుంబాన్ని పోషిస్తున్నా. రెక్కాడితేగానీ డొక్క నిండని పరిస్థితి. ఏ రోజు పని చెయ్యక పోయినా ఆ రోజు పస్తులే. మాలాంటి పేదలకు రుణాలు మంజూరుతో ప్రభుత్వం చేయూతనిస్తే ఆర్థికాభివృద్ధి సాధించగలం.

– షేక్ ఖాశిం, వల్లాపల్లి

కార్మిక బీమా వర్తింపజేయాలి



మూడు దశాబ్దాలుగా ప్రమాదకరమైన పనులే చేస్తున్నాం. రెండు దశాబ్దాలుగా కొండ రాళ్లకు బ్లాస్టింగ్‌తో మెటల్ తయారీతో జీవనాన్ని వెళ్లదీశాం. అనుమతులు తయారీకి తీసుకోవటం మెటల్ క్రషర్లు వచ్చాక గిరాకీ తగ్గింది. దీంతో ఆ పనులకు స్వస్తి పలికి వృథారాళ్ల నుంచి హద్దు, ఫెన్సింగ్ రాళ్లను 10 ఏళ్లుగా తీస్తూ జీవనం వెళ్లదీస్తున్నాం. కార్మిక బీమా వర్తింపుతో చేయూతనివ్వాలి.

–షేక్ చిన ఖాశిం, వల్లాపల్లి

రాళ్ల ఎగుమతితోనే జీవనం



పదేళ్లుగా గ్రానైట్ పరిశ్రమ వద్ద వృథా రాళ్లను వల్లాపల్లి గ్రామానికి తీసుకొచ్చి హద్దు రాళ్లుగా తయారు చేస్తున్నాం. ఇక్కడ తయారు చేసిన రాళ్లను ఆర్డర్‌లపై రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులకు ఎగుమతి చేస్తున్నాం. ఎగుమతుల్లో ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారం చేస్తూ జీవనాన్ని వెళ్లదీస్తున్నాం.

– షేక్ నాగుల్‌మీరా, వల్లాపల్లి

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: ఐటీఐలో ప్రవేశం కోసం ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హుల్దాలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఫిట్టర్, మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ మరియు మెకానిక్ డీజిల్ కోర్సులకు మిగిలిపోయిన సీట్ల ప్రవేశం కొరకు మూడో విడత ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు iti.ap.gov.in నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు 20తేదీ లోపు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరై సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 22వ తేదీ 10గంటలకు జరిగే అడ్మిషన్‌కు హాజరు కావాలని తెలిపారు.

వెంకన్న సన్నిధానానికి మార్టూరు కూరగాయలు

మార్టూరు: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధానంలో ప్రతిరోజూ లక్షల మందికి పైగా భక్తులకు అన్నదానం జరుగుతోంది. అన్నదానంలో కూరగాయలను అందజేయడానికి మార్టూరు భక్తులు మూడు నెలలు క్రితం అనుమతి కోరారు. దీనికి దేవస్థానం నుంచి సెప్టెంబర్ 10వ తేదీ కల్లా మార్టూరు నుంచి కూరగాయలు పంపాలని టీటీడీ వారు సందేశం పంపారు. ఇందుకోసం స్వామివారి ప్రత్యేక వాహనం ఆదివారం ఉదయం మార్టూరుకు చేరుకుంటుంది. కూరగాయల యార్డు నుంచి లోడుతో మార్టూరులోని ప్రధాన సెంటర్‌లోని పెద్ద కానా వద్దకు చేరుకుంటుంది. మార్టూరు భక్తులు గతంలో ఒకసారి కూరగాయల లోడును తిరుమలకు పంపారు. మార్టూరులో ఒక ఆధ్యాత్మిక సంబరం నిర్వహిస్తామని, స్వామి వాహనం వద్ద వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మార్టూరు కూరగాయాల సంఘం తెలిపింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి లడ్డు ప్రసాదం అందజేస్తామన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళ్తే కులంపేరుతో దూషణ

చినగంజాం ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ

చినగంజాం: పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తన భర్తను చినగంజాం ఎస్‌ఐ కొమరిశెట్టి సురేష్ పరుష పదజాలంతో తిట్టి, కులం పేరుతో దూషించాడంటూ చినగంజాంకు చెందిన మహిళ దేవరకొండ నాగేంద్రం శుక్రవారం బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చినగంజాంకు చెందిన దేవరకొండ సుబ్బారావు, భార్య నాగేంద్రం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి పవన్‌రెడ్డి అనే వ్యక్తి కొంత నగదు ఇవ్వాల్సి ఉండటంతో ఫోన్ చేసి అడిగారు. పవన్‌రెడ్డి ఫోన్‌లో సుబ్బారావు, అతని భార్యను కులం పేరిట దుర్భాషలు ఆడాడు. ఈ విషయమై 7వ తేదీ చినగంజాం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించి ఫోన్ రికార్డును కూడా వినిపించగా ఎస్‌ఐ శుక్రవారం రమ్మని చెప్పారు. శుక్రవారం స్టేషన్‌కు వెళ్లగా పరుషపదజాలంతో దూషిస్తూ నీ మీద లేనిపోని కేసులు పెట్టి ఇరికిస్తా అని అవమానపరిచాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త దివ్యాంగుడని కూడా చూడకుండా ఎస్‌ఐ దూషణలు చేస్తూ, బెదిరించి పంపించాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయనున్నట్లు ఎస్పీ తమకు హామీ ఇచ్చాడని నాగేంద్రం, ఆమె భర్త సుబ్బారావు తెలిపారు.

పురాతన ఆలయం.. కూలేందుకు సిద్ధం

- ఆలయానికి 30 ఎకరాల మాన్యం భూములు
- ప్రతి ఏడాది రూ. 2 లక్షల వరకు కౌలు ఆదాయం వస్తున్నా అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- ఇప్పటికే ఆలయం వెనుకభాగంలో కూలిన గోడ
- ఆలయానికి వెళ్లాలంటేనే భయపడుతున్న భక్తులు


ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి విగ్రహాలు


కొణిదెనలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయం

బల్లికురవ: ఎంతో చరిత్ర కలిగిన గ్రామంలో ఎత్తయిన కొండపై కొలువైన ఉన్న శ్రీదేవి–భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయం జీర్ణావస్థతో కూలేదశకు చేరింది. బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామాన్ని 12వ శతాబ్దంలో రాజులు పరిపాలించారు. అప్పట్లో గ్రామంలో 101 బావులు, 101 శివలింగాలు ఏర్పాటుతో పాటు గ్రామానికి ఆగ్నేయ భాగంలో కొండపై శ్రీదేవి–భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాలకు ఆలయం కింద భాగంలో మండపం ఏర్పాటు చేశారు. స్వామివారికి 30 ఎకరాల సుక్షేత్రమైన భూములు గ్రామంలో ఉన్నాయి. ప్రతి ఏడాది కౌలు వేలం ద్వారా స్వామివారికి రూ. 2 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నా ఆలయ అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ వహించటంలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్షణ క్షణం.. భయం భయం..

ఆలయాన్ని నిర్మించి 1100 సంవత్సరాలు పూర్తికావటంతో జీర్ణావస్థకు చేరింది. ఆలయం వెనుక భాగంలోని గోడ ఇటీవల పడిపోయింది. ఆలయమంతా పగుళ్లు వచ్చి పడిపోయే స్థితికి చేరింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాలైన గంగపాలెం, రాజుపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, మల్లాయపాలెం గ్రామాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకునేవారు. నేడు ఆ పరిస్థితి లేదు కూలేదశతో భక్తులు ఆలయానికి వెళ్లాలంటే భయపడిపోతున్నారు. దీనితో భక్తుల రాక పూర్తిగా తగ్గిపోయింది.


ఆలయ వెనుకభాగం పడిపోతున్న దృశ్యం

ఒకరి మీద ఒకరు సాకులు..



వంశపారపర్యంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నాం. ఆలయం వెనుక భాగం కూలటంతో ఏ సమయంలో పడిపోతుందో, విగ్రహాలు, మూలవిరాట్ దెబ్బతింటాయోమోనని భయపడుతున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే నివేదనలు చేస్తున్నాం, అభివృద్ధి విషయంలో పురావస్తు శాఖ, దేవదాయశాఖ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దేవదాయశాఖ మంత్రి దృష్టికి గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లారు. ఇప్పటికైనా అభివృద్ధితో పూర్వ వైభవం తీసుకురావాలి.

– ఐ.శోభనాచార్యులు, అర్చకుడు

పురావస్తుశాఖ ఆధీనంలో ప్రధాన ఆలయాలు

కొనిదెనలోని ప్రధాన ఆలయాన్ని పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్నాయి. చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అభివృద్ధి పరచాలంటే వారే నివేదిక ఇవ్వాలి. అప్పుడు సీజీఎఫ్ నిధులతో గ్రామస్తుల వాటాధనం, సమకూర్చితే అభివృద్ధి పరచగలం.

– పానకాలరావు, బాపట్ల దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా యార్లగడ్డ


పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యార్లగడ్డ లక్ష్మీనారాయణ

బాపట్లటౌన్: భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా యార్లగడ్డ లక్ష్మీనారాయణను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల మండలం, జమ్ములపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ లక్ష్మీనారాయణ గతంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా పనిచేశారు. వీటితోపాటు పార్టీ అభ్యున్నతికోసం గతంలో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో పనిచేశారు. యార్లగడ్డ నియామకంపై బీజేపీ జిల్లా నాయకులు హర్షం వ్యక్తంచేశారు. యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎకో ఇండియా శిక్షణకు పేరాల ఉపాధ్యాయుడు


శిక్షణలో ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న భానుచంద్రమూర్తి

చీరాల టౌన్: ఢిల్లీకి చెందిన నేషనల్ గ్రీన్ కార్ప్స్, ఎకో ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాల ఎన్‌జీసీ సమన్వయకర్తలు, క్లస్టర్ కో–ఆర్డినేటర్లకు పర్యావరణంపై విశాఖపట్నంలో రెండురోజుల పాటు శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి బాపట్ల జిల్లా కో–ఆర్డినేటర్, పేరాల హైస్కూల్ ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి హాజరయ్యారు. పర్యావరణ హితం కోసం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు, సామాజిక సేవా కార్యక్రమాలపై నిపుణులు పలు సూచన లు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి, ఎకో ఇండియా అధినేత దీపాఘూ, డి.గౌరీశంకర్, రాష్ట్ర సమన్వయకర్త పి.నీలకంఠం, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా మామిడిపాక


మామిడిపాక హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా పర్చూరుకు చెందిన మామిడిపాక హరిప్రసాద్ ఎంపికయ్యారు. ఈమేరకు ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేసినట్లు హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం పర్చూరులో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు హరిప్రసాద్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సీరం సుబ్బారావు, పల్లపోతు రాఘవయ్య, ఊటుకూరి సుబ్బారావు, బాపనపల్లి భాస్కరరావు, ఎక్కల సుబ్బారావు, మామిడిపాక పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అప్రైజర్ మోసంపై కేసు నమోదు

- 50 గోల్డ్‌ఖాతాల్లో నకిలీ బంగారం
- 23 మంది బినామీలతో ఖాతాలు
- మొత్తం రూ.87.91 లక్షలు గోల్డ్‌లోన్
- వడ్డీతో కలిపి మొత్తం రూ.93 లక్షలు
- మరో 304 గ్రాముల బంగారంతో ఉడాయించినట్లు ఫిర్యాదు
- బ్యాంక్ మేనేజర్ ద్వారా వివరాలు తీసుకుని కేసు నమోదు

యద్దపాడు: నకిలీ గోల్డ్ తనఖా పెట్టి బ్యాంక్‌కు టోకరా వేసిన అప్రైజర్ హరీష్ విషయం అందరికీ తెలిసిందే. దీనిపై బ్యాంక్ అధికారులు పోలీసులకు నకిలీ గోల్డ్, వాటిపై తీసుకున్న రుణం, వడ్డీ తదితర విషయాలపై గతనెల 30న యూనియన్ బ్యాంక్(యూబీఐ) యద్దపాడు శాఖలో వెలుగు చూసిన ఘటనపై బ్యాంకర్లు అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు అప్రైజర్ ఎంతకాలంగా..ఎ న్ని ఖాతాలలో.. బినామీ పేర్లతో.. ఎంత నకిలీ బంగారం పెట్టి.. ఎంత రుణం తీసుకున్నడనే అంశంపై నాటి నుంచి వరసగా నాలుగు రోజుల పాటు వృత్తి నిపుణులతో గోల్డ్‌లోన్ల ఖాతాలపై సమగ్ర పరిశీలన చేయించారు. బ్యాంక్ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ ఆడిట్‌లో ఆ బ్యాంక్‌లోని 1886 గోల్డ్ ఖాతాల్లో 50 ఖాతాల్లో అప్రైజర్ హరీష్ నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. 23 మంది బినామీ పేర్లతో పెట్టిన ఈ బంగారంపై రూ.87.91 లక్షల రుణం తీసుకున్నట్లు తేల్చారు. ఆయా ఖాతాలకు తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ.93 లక్షలు అయినట్లు లెక్కలు కట్టారు. 2015 నుంచి పథకం ప్రకారంగా తమ బ్యాంక్‌లో నకిలీ బంగారాన్ని పెట్టి రూ.2 లక్షల కంటే తక్కువగా రుణం పొందుతున్నట్లు వారి పరిశీలనలో తేలింది. అప్రైజర్ మోసం వెలుగు చూసేందుకు కారణమైన ఏడు ఖాతాలదారులు తనఖా పెట్టిన 304 గ్రాముల బంగారంతో ఉడాయించినట్లు తమ ఫిర్యాదులో యద్దపాడుశాఖ యూబీఐ మేనేజర్ తిలక్ పోలీసులకు పూర్తి వివరాలను అందించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. అయితే బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ తీసుకున్న ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేవలం బ్యాంక్‌కు మాత్రమే అప్రైజర్ నష్టం కలిగించినట్లు యూబీఐ అధికారులు వెల్లడించారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆయా వివరాల ప్రకారంగా శుక్రవారం కేసు నమోదు చేసుకుని చిలకలూరిపేట సీఐ వై.అచ్చయ్య ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ ప్రతిష్ట ఇనుమడింపజేయాలి

నరసరావుపేట: పోలీసుల ప్రతిష్ట ఇనుమడించేలా విధులు నిర్వహించాలని నూతన ఎస్‌ఐలకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. జిల్లా పరిధిలో ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా మాచవరం, పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐలుగా ఎస్‌ఐగా సమీర్ బాషా, కోటయ్య నియమితులయ్యారు. శుక్రవారం వారు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రణాళికాబద్ధంగా జగనన్న ఆరోగ్య సురక్ష

వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పి.రంజిత్‌బాషా


జిల్లాలోని అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ప్రణాళికాబద్ధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించాలని, దీనికోసం షెడ్యూల్ ఖరారు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై డివిజన్, మండలస్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జగనన్న సురక్షలానే ప్రభుత్వం కొత్తగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రెడ్‌క్రాస్ సంస్థకూ భాగస్వామ్యం కల్పించాలని వివరించారు.

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల పరిశీలనకు ప్రతి మండలానికి 17 మంది అధికారులను పంపుతామని వివరించారు.
- చెత్తసంపద కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలన్నారు. భట్టిప్రోలు మండలంలో గృహాల మధ్య మురుగునీరు నిల్వ ఉండడంపై అధికారులను కలెక్టరు నిలదీశారు. ఎంపీడీఓకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డీపీఓను ఆదేశించారు.
- పాఠశాలల్లోని బాలబాలికల వివరాలను స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలని కలెక్టరు సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 713 మంది చిన్నారులను గుర్తించలేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు.
- సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియను ఈనెల 15వ తేదీలోగా ముగించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి ఎస్. విజయమ్మ, ఆర్.డి.ఓలు జి.రవీందర్, పార్థసారధి, పి.సరోజిని, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ పోతుల సునీత


అందుతున్న సేవలపై మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ సునీత

వేటపాలెం: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. వేటపాలెంలోని సచివాలయం–1, 3లను ఎమ్మెల్సీ శుక్రవారం పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు త్వరగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. సచివాలయాల్లో నూతనంగా 1.40 లక్షలు మంది యువతకు ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. సచివాలయాలకు అనుబంధంగా 2.60 లక్షలు మంది వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్లకే అందిస్తున్నారని తెలిపారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు చేసుకొనే విధంగా నూతన విధానం తీసుకొచ్చారని చెప్పారు. ఆమె వెంట సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతమైన పాలన

పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ జె.మురళి


పంచాయతీ కార్యదర్శుల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జె.మురళి

బాపట్ల: గ్రామస్థాయి పాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. బాపట్లలోని విస్తరణ కేంద్రంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో శుక్రవారం డైరెక్టర్ మురళి పాల్గొన్నారు. పంచాయతీ అభివృద్ధి, సూచిక తయారీ, శిక్షణ అభివృద్ధి లక్ష్యాలను తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికారం, సామర్థ్యాన్ని కలిపి ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ పరిపాలనలో సాధారణంగా ఎదురయ్యే ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో ఎలా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలో తెలుసుకోవాలన్నారు. పరిపాలనలో సహజంగా ఉద్యోగులు ఒత్తిడికి గురవుతారని, వాటిని అధిగమించాలని సూచించారు. హృదయం, శరీరంలోని వివిధ అంశాలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు నలుగురు విద్యార్థినులు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో కళాశాల చైర్మన్ శేషగిరిరావు తదితరులు

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. బాపట్ల జిల్లా మార్టూరులో షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో పోటీల్లో తమ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం సీఎస్‌ఈ విద్యార్థిని షేక్ కరిష్మా, తృతీయ సంవత్సరం విద్యార్థిని కె.శ్రీలత, ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థినులు షేక్ అఫ్రీన్, వి.భార్గవి ప్రతిభ చాటినట్టు తెలిపారు. కావలిలో ఈనెల 8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినుల్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డి.శ్రావ్య, అధ్యాపకులు అభినందించారు.